

బైక్ దొంగను పట్టించిన మెకానిక్

వడ్డేపల్లి, మార్చి 29: ఓ మెకానిక్ బైక్ దొంగను పట్టించిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. శాంతినగర్‌లోని మెకానిక్ రవి వద్దకు గుర్తు తెలియని వ్యక్తి బైక్ తెచ్చి అమ్ముతానని చెప్పాడు. బైక్‌కు సంబంధించిన పత్రాలు అడుగగా తన వద్ద ఏమీ లేవని, రూ.10 వేలకు అమ్ముతానని తెలిపాడు. అనుమానం వచ్చిన రవి చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు షాప్ వద్దకు రాగానే, దొంగ పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఇతరుల సాయంతో పట్టుకుని అతడిని, బైక్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణ చేసి, అయిజకు చెందిన యజమానికి బైక్‌ను అప్పజెప్పారు.

ధాన్యం కొనుగోలుకు..
కసరత్తు

- ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 799 కేంద్రాల ఏర్పాటు
- మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,203


వనపర్తి మండలం చిట్యాల నుంచి తూర్పుతండా వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం(ఫైల్)

వనపర్తి అర్బన్, మార్చి 29: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెల నుంచి వరి కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తుగానే కేంద్రాలను రెడీ చేస్తున్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలుకు సంబంధించిన విధివిధానాలపై కలెక్టర్ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యాన్ని సేకరించాలని నిర్ణయించారు. మొత్తం 799 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

జిల్లాల వారీగా ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాల సంఖ్య	
వనపర్తి	244
మహబూబ్‌నగర్	193
జోగుళాంబ గద్వాల	64
నారాయణపేట	96
నాగర్‌కర్నూల్	202

రెండు లక్షల మెట్రిక్ టన్నుల అంచనా

వనపర్తి జిల్లా వ్యాప్తంగా 244 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 146 కేంద్రాలు, ఐకేపీ ద్వారా 98, మెప్మా ద్వారా నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా ఈ యాసంగిలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అధికార యంత్రాంగం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. కొనుగోలు కేంద్రాలు, గన్ని బ్యాగులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు ఇతర సామగ్రిని సమకూర్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ మొదటి లేదా రెండో వారంలో ధాన్యం కొనుగోలును ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. క్వింటాలుకు మద్దతు ధర గ్రేడ్ 'ఏ' రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183గా ప్రభుత్వం నిర్ణయించింది. రైతులు ధాన్యాన్ని 17 శాతం లోపు తేమ ఉండేలా తేవాలని అధికారులు సూచిస్తున్నారు. మండుతున్న ఎండల నేపథ్యంలో కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.


ప్రారంభించనున్న అధికారులు

కొనుగోలు కేంద్రాలను గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభించే వారు. కానీ ఈ యాసంగిలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో కేంద్రాలను అధికారులే ప్రారంభించనున్నారు. దీంతో కేంద్రాల ఏర్పాటులో ఆలస్యం జరిగే అవకాశం ఉండదు. ప్రతీసారి ధాన్యం వివరాలు ట్యాబ్‌లలో నమోదు చేసే క్రమంలో ఆలస్యం అవుతుందని, ఈ సారి అలా జరగకుండా చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


ధాన్యం బస్తాలను లారీలోకి ఎక్కిస్తున్న హమాలీలు(ఫైల్)

చిరుతల అలజడి

- గంగారం అడవిలో సంచారం
- మేకలు, ఆవుదూడలపై దాడులు
- తాగునీటి కోసం జనావాసాలకు వస్తున్న పులులు
- భయాందోళనలో గిరిజనులు
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న అటవీశాఖ అధికారులు
- రాత్రిళ్లు పొలాలకు గుంపులుగా వెళ్లాలని సూచన


రాత్రి వేళ చిరుత పులుల శబ్దాలు వినిపిస్తున్న మర్రికుంట గుట్ట

బిజినేపల్లి, మార్చి 29: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గంగారం అటవీ ప్రాంతంలో రెండు నెలలుగా చిరుతల సంచారం అడవికి సమీపంలో ఉన్న గిరిజన తండా వాసుల అలజడి రేపుతోంది. గంగారం, వనపర్తి జిల్లా ఘణపూర్ మండలంలోని జంగమాయిపల్లి అటవీ ప్రాంతాలు కలిసి ఉండటంతో చిరుతలు అటువైపు నుంచి వచ్చినట్లు పరిసర తాండల గిరిజనులు చెబుతున్నారు. రాత్రిళ్లు భీముడి తండా సమీపంలోని మర్రికుంట గుట్టపై నుంచి చిరుత పులుల అరుపులు వినిపిస్తున్నాయని అంటున్నారు. నెల రోజుల క్రితం పొలంలో కట్టేసిన ఆవు దూడను చిరుతలు దాడి చేసి చంపేశాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పులులు తిన్న తర్వాత అడవిలో పందులు, జింకల కళేబరాలను చూశామని అంటున్నారు. ఘణపూర్ మండల పరిధిలోని మానాజీపేట గ్రామ సమీపంలో ఒకసారి, మరోసారి ఘణపూర్, అవుసలోనిపల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిని చిరుతలు దాటుతుండగా వాహనదారులు ప్రత్యక్షంగా చూసి భయభ్రాంతులకు లోనయ్యారు.


భీముడి తండా సమీపంలో చిరుత పులి అడుగుజాడ గుర్తులు

అడవిలో పుష్కలంగా ఆహారం, నీళ్లు

నాలుగు వేల ఐదు వందల హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న గంగారం అడవిలో పదేళ్ల కాలంలో జింకలు, అడవి పందుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికి తోడు అడవిలో కుంటలు, చెక్ డ్యాంలలో జంతువులు తాగేందుకు నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. ఘణపూర్ మండలం వైపు నుంచి ఆహారం కోసం ఇటుగా వచ్చిన చిరుతలకు వేటాడి ఆకలి తీర్చుకునేందుకు జింకలు, అడవి పందులు, తలదాచుకునేందుకు కొండలు, గుట్టలు, దట్టమైన అటవి ఉండటంతో ఇక్కడే సంచరిస్తున్నాయి. చిరుతలు రాత్రి వేళ తాగునీటి కోసం సమీప పొలాల బోరుబావుల వద్దకు వస్తున్నట్లు గిరిజనలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మేకలు, గొర్రెలు, పశువులను అడవి సమీపంలో మేపుకొని జీవనం సాగించే వారు చిరుత పులులు ఎటు వైపు నుంచి వచ్చి దాడి చేస్తాయేమోనని బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు.

ద్విచక్ర వాహనానికి అడ్డం వచ్చిన చిరుత

బిజినేపల్లి మండలం లట్టుపల్లి గ్రామానికి చెందిన ఒక యువకుడు వనపర్తి జిల్లా ఘణపూర్ మండలంలోని జంగమాయిపల్లిలో పని ముగించుకొని గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో లట్టుపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. భీముని తండా సమీపంలో కేఎల్ఐ కాలువ వద్ద చిరుత పులి రోడ్డు దాటుకుంటూ వెళ్లిందని చెప్పాడు. కళ్ల ముందు నుంచి పులి వెళ్లడంతో ప్రాణభయంతో భీముడి తండాకు వచ్చి స్థానికులకు చెప్పాడు. గిరిజనులు వెళ్లి చూడగా పులి జాడలు కనిపించాయి. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దాంతో వారు అటవీ సమీప ప్రజలు, రైతులు, పశువులకాపరులు సాయంత్రం లోపే తండాకు చేరుకోవాలని, అత్యవసరమైతే గుంపులుగా వెళ్లాలని అటవీ అధికారులు చెబుతున్నారు. పులులను పట్టుకునేందుకు అవసరమైన బోనులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.


అడవిలో జంతువుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన సోలార్ బోరు మోటార్

పులి అరుపులు విని ఇంటికి వచ్చా..



నాకు అడవికి ఆనుకొని తొమ్మిది ఎకరాల పొలం ఉంది. రాత్రిపూట పశువులను పొలంలోని దొడ్డిలో కట్టేసేవాడిని. నెల రోజుల క్రితం తండాలో ఓ ఆవుదూడను గుర్తు తెలియని జంతువు చంపి తినడంతో భయంతో ఇంటి దగ్గరే కట్టేస్తున్నాను. అడవి పందుల నుంచి జొన్నపంటను కాపాడుకునేందుకు కాపలాగా పొలానికి వచ్చాను. గాండ్రిపు శబ్దాలు రావడంతో అటువైపు చూడగా చిరుతపులి కనిపించడంతో ఇంటికి తిరిగి వచ్చా. రాత్రి వేళల్లో పులి గాండ్రిపులు వినిపిస్తున్నాయి.

- లక్ష్మణ్ నాయక్, రైతు, భీముని తండా

రాత్రి వేళ జాగారం చేస్తున్నాం..



భీముడి తండా, కిమ్య తండాల ప్రజలు చిరుత పులులను చూశామని చెబుతున్నారు. భీముడి తండా సమీపంలోని మర్రికుంట పక్కనే ఉన్న గుట్టపై నుంచి రాత్రి వేళల్లో చిరుత పులుల అరుపులు వినిపిస్తున్నాయి. రాత్రి సమయాల్లో తండాలోకి వచ్చి మనుషులపై దాడి చేస్తాయేమోనని భయంతో జాగారం చేస్తున్నాం. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు బోనులు ఏర్పాటు చేసి, చిరుత పులులను బంధించి తీసుకుపోవాలి.

- మాన్యానాయక్, మాజీ ఉప సర్పంచ్, మీట్య తండా

అప్రమత్తంగా ఉండాలి



రెండు నెలల క్రితం ఘణపూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు చిరుతలు సంచారిస్తున్న వీడియోలు తీశారు. అడవిలో జంతువుల కదలికల పరిశీలనకు వెళ్లినప్పుడు చిరుత పులి అడుగు జాడలను గుర్తించాం. అడవిలో జంతువుల కోసం కుంటలు, చెక్‌డ్యాంలలో సోలార్ పంపు మోటర్ల ద్వారా నీటిని వదులుతున్నాం. అడవిలో జింకలు, అడవి పందుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. వాటి కోసం, తాగునీటి కోసం పులులు రాత్రి సమయాల్లో వస్తుంటాయి. కాబట్టి పరిసర ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి.

- పర్వేజ్ అహ్మద్, ఎఫ్ఆర్‌వో, నాగర్‌కర్నూల్ జిల్లా

పాలమూరుతో అనుబంధం

- తెలంగాణలో బీజేపీకి డబుల్ డిజిట్
- పాలమూరు, నాగర్‌కర్నూల్ రెండింట్లో భారీ మెజారిటీ
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 29: దేశంలో ప్రజలంతా మోదీని మూడోసారి ప్రధాన మంత్రిని చేయాలని నిర్ణయించుకున్నారని, ఇందులో భాగంగానే తెలంగాణలో ఈసారి బీజేపీకి డబుల్ డిజిట్‌లో ఎంపీ స్థానాలు వస్తాయని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని సుదర్శన్ కన్వెన్షన్ హాల్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలను భారీ మెజారిటీతో గెలువబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. తనకు మహబూబ్‌నగర్ జిల్లాతో ఎంతో అనుబంధం ఉందని, ఏ కార్యక్రమం చేపట్టినా ఇక్కడి నుంచే ప్రారంభిస్తానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార కార్యాచరణ కూడా ఇక్కడినుంచే ప్రారంభించబోతున్నానని చెప్పారు. రానున్న నెల రోజులు బీజేపీ కార్యకర్తలంతా డోర్ టూ డోర్ క్యాంపెయిన్ నిర్వహించాలని అన్నారు. ప్రతీ ఇంటికి వెళ్ళి వారి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు బీజేపీకి ఓటు వేయకపోవచ్చని, పార్లమెంట్ ఎన్నికలు అలాకాదని అన్నారు. దేశ సమగ్రత, భద్రత, శాంతి భద్రతలు, ఆధ్యాత్మిక చింతన కోసం ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుతున్నారని వెల్లడించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఆరు గ్యారెంటీలను అమలు చేసే శక్తి లేదన్నారు. రాష్ట్రంలో కరువు ముంచుకొస్తుందన్నారు. తాగునీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితులున్నాయని, విద్యుత్ కోతలు ప్రారంభం అయ్యాయని అన్నారు. వీటిని ఎలా అధిగమిస్తారో ప్రభుత్వం దృష్టి సారించడం లేదని విమర్శించారు. రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లుగా మారిందని, దొంగలు పోయి గజదొంగలు వచ్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మన్మోహన్ సింగ్ హయాంలో రూ.12 లక్షల దోపిడీ చేశారని, మోదీ పదేళ్లలో అవినీతిపై విమర్శలు చేసే అవకాశమే లేకుండా పాలన సాగించారన్నారు. దేశానికి కాదు ప్రపంచానికే ఆయన నాయకుడని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం వల్లే పార్టీ మారినట్లు మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి వ్యాఖ్యానించారని మీడియా అడిగిన ప్రశ్నకు.. రెండుసార్లు ఆయన పార్టీలోకి వచ్చి వెళ్ళారని, ఆయన పార్టీ ఎందుకు మారారో పాలమూరు ప్రజలకు, తెలంగాణ ప్రజలకు తెలుసని అన్నారు. ఆయన విచక్షణకే వదిలేస్తున్నానని కిషన్‌రెడ్డి బదులిచ్చారు. సమావేశంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ, నాయకులు బంగారు శ్రుతి, రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, రతంగ్‌పాండురెడ్డి, జోకూరు పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, నాగురావు నామాజీ, పడాకుల బాలరాజు, కొండయ్య అందె బాబయ్య, కొండా ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, వీర బ్రహ్మాచారి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత

- రంగారెడ్డి జిల్లా షాబాద్‌కు చెందిన విజయగా గుర్తింపు


మహిళను అప్పగించడానికి కృషి చేసిన యువకులను సన్మానించిన ఎస్ఐ

వనపర్తి రూరల్, మార్చి 29: వనపర్తి పట్టణ కేంద్రంలోని మర్రికుంట ప్రాంతంలో తిరుగుతున్న మతిస్థిమితం లేని మూగ మహిళను రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. 15 రోజుల నుంచి ఆ మహిళ మర్రికుంట ప్రాంతంలో తిరుగుతూ, బాలరాజు నాయక్ హోటల్ పక్కన ఉండేది. బాలరాజు నాయక్ రోజూ ఆమెకు భోజనాన్ని అందించేవాడు. అటుగా వెళ్తున్న వనపర్తి పట్టణానికి చెందిన కంచె రాఘవేందర్, అతని ఫ్రెండ్స్ ఆమెను గమనించారు. ఆమె వద్ద ఉన్న ఆధార్‌కార్డులో అడ్రస్‌ను చూసి, రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఎస్ఐ ఆమె దగ్గర ఉన్న ఆధార్ కార్డు ద్వారా రంగారెడ్డి జిల్లా షాబాద్‌కు చెందిన విజయగా గుర్తించారు. షాబాద్ ఎస్ఐతో మాట్లాడి, కుటుంబ సభ్యుల వివరాలు, ఫోన్ నంబర్ తీసుకుని సమాచారం అందించారు. వారు రావడంతో ఆ మహిళను అప్పగించారు. మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించడానికి కృషి చేసిన కంచె రాఘవేందర్‌ను, బాలరాజు నాయక్‌ను రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


బుచ్చమ్మ(ఫైల్)

గోపాల్‌పేట, మార్చి 29: వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధురాలు శుక్రవారం విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందింది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పలుస బుచ్చమ్మ(70) కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. బుచ్చమ్మ మాత్రం మండల కేంద్రంలో ఉంటోంది. శుక్రవారం ఉదయం ఇల్లు శుభ్రపరుచుకుని దుస్తులు ఉతుకుతున్న సమయంలో మోటార్ స్విచ్ ఆన్ చేయడానికి వెళ్లింది. దాంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. బుచ్చమ్మ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

ప్రజల మాటే మా మేనిఫెస్టో

- అభివృద్ధి నినాదంతో సూచనలు తీసుకునేందుకు సిద్ధం
- కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేసి.. ప్రజల మన్ననలను పొందిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లోనూ ప్రజల మాటే మా మేనిఫెస్టో అనే నినాదంతో ముందుకు వెళ్తోందని ఆ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. కేవలం ఓట్లు సాధించడమే కాకుండా అభివృద్ధినే అభిమతంగా తీసుకోనున్నామని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ ఆరో తేదీన తుక్కుగూడలో నిర్వహించే భారీ బహిరంగ సభలో కేంద్రంలో అధికారంలోకి వస్తే కాంగ్రెస్ పార్టీ చేయనున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మేనిఫెస్టోను విడుదల చేస్తారని తెలిపారు. అదే సమయంలో మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి కూడా లోకల్ మేనిఫెస్టోను సిద్ధం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీనికోసం ప్రజల మాటే.. మా మేనిఫెస్టో పేరుతో పార్లమెంట్ పరిధిలోని ప్రతీ ఇంటికి కరపత్రాలు చేరవేయనున్నట్లు తెలిపారు. ఆ కరపత్రాల క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే డాక్యుమెంట్ ఓపెన్ అవుతుందని, అందులో సమస్యలు కానీ, విన్నపాలు కానీ పేర్కొనవచ్చని చెప్పారు. అలాగే వాయిస్ రికార్డ్ సదుపాయం కూడా అందులో ఉందన్నారు. దీంతోపాటు వాట్సప్‌లో, మెసేజ్‌ల ద్వారా లింకులు పంపిస్తామన్నారు. కేవలం ప్రజలే కాకుండా సంఘాలు, అసోసియేషన్లు, వివిధ యూనియన్ల వారు కూడా తమ వినతిపత్రాలను ఇవ్వడానికి డాక్యుమెంట్ అటాచ్‌మెంట్ సదుపాయం కల్పించామన్నారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు స్వీకరించిన తర్వాత స్థానికంగా మేనిఫెస్టో తయారు చేసుకుని, తుక్కుగూడ సభలో విడుదల చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అండ, ఎమ్మెల్యేల సహకారంతో పాలమూరు రూపురేఖలను మారుస్తామన్నారు. తాను నిజాయితీ కలిగిన 24 క్యారెట్ల రాజకీయ నాయకుడినని, తాను లిక్కర్ దందాలు, దొంగ కల్లు వ్యాపారాలు, కాంట్రాక్టర్లను బెదిరించడం, రింగులు చేసి.. పనులు చేయకుండానే బిల్లులు తీసుకోవడం చేయలేదన్నారు. పర్యావరణం కలుషితమయ్యేలా క్రషర్ యూనిట్లను నడిపించలేదని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేష్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంను కలిసిన డాక్టర్ చెన్నయ్య



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ వైస్ చైర్మన్ డాక్టర్ చెన్నయ్య

కందనూలు, మార్చి 29 : తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవితో కలిసి కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిస్థితి గురించి చర్చించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్, టెన్నిస్‌బాల్ టోర్నమెంట్

కొల్లాపూర్, మార్చి 29 : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు చౌటబెట్ల యూత్ అసోసియేషన్ ఆర్గనైజర్లు బాలకృష్ణ, విష్ణులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 5గంటలకు ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్, టెన్నిస్‌బాల్ క్రీడా పోటీల డ్రా తీయనున్నట్లు పేర్కొన్నారు. 31వ తేదీ ఉదయం నుంచి మ్యాచ్‌లు ప్రారంభమవుతాయన్నారు. ప్రథమ బహుమతి రూ. 30వేలు, ద్వితీయ బహుమతి రూ. 20వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రికెట్ క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ. 1000 చెల్లించి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చన్నారు.

దుర్భాషలాడిన వ్యక్తులపై కేసు నమోదు

ఉండవల్లి, మార్చి 29: గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలో విక్రమాచార్య అనే వ్యక్తిని దుర్భాషలాడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌కానిస్టేబుల్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన విక్రమాచార్య గుడి స్థలం ఆక్రమించుకున్నాడని అదే గ్రామానికి చెందిన పాముల ఆంజనేయులు మరికొందరు దుర్భాషలాడి దాడి చేశారు. అలాగే స్థలానికి వేసిన ఇనుప ఫెన్సింగ్ పోల్స్‌ను బలవంతంగా తొలగించారు. దాంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పాముల ఆంజనేయులుతో పాటు మరికొందరిపై ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ శ్రీనివాసులు నాయక్ కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

మక్తల్, మార్చి 29 : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని చత్రపతి శివాజీమార్గ్(సంగంబండ రోడ్)లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి సంగంబండ కాల్వ వరకు ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ అధికంగా ఉంటుంది. ద్విచక్ర వాహనాలు, పాదచారులు అధికంగా వచ్చిపోతుంటారు. దీనికితోడు పట్టణంలో ప్రధాన పాఠశాలలు, కళాశాలలు ఇదే రహదారిలో ఉండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతీనిత్యం వేలాది మంది విద్యార్థులు వచ్చిపోతుండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించి స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదపుటంచున వాటర్ ట్యాంక్



పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన వాటర్ ట్యాంక్


చిన్నంబావి, మార్చి 29 : వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం బెక్కెం గ్రామంలో వాటర్ ట్యాంకు ప్రమాదకరంగా మారింది. ట్యాంకు పైభాగంలో పెచ్చులు ఊడిపోయి ఇనుప సీకులు తేలి బలహీనంగా తయారైంది. నీటిని తీసుకొచ్చేందుకు గాను వాటర్‌ట్యాంకు వద్దకు వెళ్లాలంటేనే జనాలు బిక్కుబిక్కుమంటూ అడుగులు వేస్తున్నారు. గత కొంత కాలంగా వాటర్ ట్యాంక్ పరిస్థితిపై స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా దానివైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్థులు పేర్కొన్నారు. ఎలాంటి ఘటనలు జరగకముందే వాటర్‌ట్యాంక్‌ను పునరుద్ధరించడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు రావాలని వారు కోరారు.
















రాజోలిలో రెండు గడ్డివాముల దగ్ధం

- రూ. రెండు లక్షల ఆస్తి నష్టం



రాజోలిలో దగ్ధమవుతున్న గడ్డి వాములు

రాజోలి, మార్చి 29 : గద్వాల జిల్లా రాజోలిలో రెండు గడ్డివాములు దగ్ధమయిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... కొత్త రాజోలిలో ప్రధాన రహదారి పక్కన గ్రామానికి చెందిన అన్నతమ్ముడ్లు రేపల్లె పేతూరు, రేపల్లె సురేష్ అనే రైతులకు గడ్డివాములు వేసుకున్నారు. మొదట ఓ గడ్డివాముకు చుట్టూ ఉన్న ముండ్ల కంపకు నిప్పు అంటుకోగా, పక్కనే ఉన్న మరో గడ్డివాముకు మంటలు వ్యాపించి రెండు దగ్ధమయ్యాయి. స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. దాంతో దాదాపు రూ. రెండు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు స్థానికులు అంచనా వేశారు. వేసవిలో తమ పశువులకు మేతలేకుండా పోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు వేడుకున్నారు.

టెట్‌పై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కె.జంగయ్య

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 29: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)పై ఉపాధ్యాయుల్లో నెలకొన్న సందేహాలను తక్షణమే నివృత్తి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విడుదల చేసిన అన్ని నోటిఫికేషన్లలో 23 ఆగస్టు 2010 ముందు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు చేశారని, కానీ ప్రస్తుత నోటిఫికేషన్ నందు ఆ నిబంధన తొలగించారని పేర్కొన్నారు. అయితే ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు ఎవరూ టెట్ రాయాలని గాని, ఏ పేపరు రాయాలని గాని పేర్కొన లేదన్నారు. ఇది ఉపాధ్యాయుల్లో తీవ్ర గందరగోళానికి దారి తీసిందన్నారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 10 వరకే టెట్ దరఖాస్తు గడువు ఉందని, ఉపాధ్యాయులు టెట్ రాయాలా వద్దానే సందేహాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని ఆయన కోరారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీధర్ శర్మ, రాష్ట్ర కమిటీ సభ్యుడు చిన్నయ్య, జిల్లా ఉపాధ్యాయులు రమా దేవి, జిల్లా కోశాధికారి జె.బాలరాజు, నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, మహేష్‌బాబు, శంకర్, లక్ష్మణ్, శ్రీనివాస్, నెహ్రూప్రసాద్ పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలి

- కార్యాలయం ముందు ధర్నాకు దిగిన బీజేపీ నాయకులు



ఫారెస్టు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కొల్లాపూర్, మార్చి 29 : గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని తొలగించి ఎత్తికెళ్లిన ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు కల్యాణ్‌లు డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని ఫారెస్టు కార్యాలయాన్ని బీజేపీ నాయకులు, గిరిజన మహిళలు ముట్టడించారు. ర్యాలీగా వెళ్లి కార్యాలయం గేటు ముందు భైఠాయించి ఆందోళన చేపట్టారు. డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, సీఐ మహేష్ బీజేపీ నాయకులకు నచ్చజేప్పడంతో ఆందోళన విరమించారు. రెండు రోజుల్లో విగ్రహాన్ని ఎత్తం గట్టు సమీపంలో ప్రతిష్ఠించకపోతే ధర్నాలు, ఆందోళన చేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.

అధ్వానంగా డీ-6 కాల్వ లైనింగ్

- నీటి విడుదలకు ముందే మరమ్మతులు చేపట్టాలంటున్న రైతులు

అత్మకూరు, మార్చి 29: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వల పరిస్థితి అధ్వానంగా మారింది. వరద ఉధృతి కారణంగా ఆయా చోట్ల పంట కాల్వలకు రంధ్రాలు ఏర్పడడంతో ఆయకట్టుకు నీరు అందని పరిస్థితి దాపురించింది. దాంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ వేసవి లోనైనా ప్రాజెక్టు ఉన్నతాధికారులు స్పందించి కాల్వల మరమ్మతులను చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

దెబ్బతిన్న లైనింగ్

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువకు అనుసంధానంగా జూరాల శివారులో డీ-6 కాలువ ద్వారా జూరాల, మొట్లంపల్లి, గుంటుపల్లి, కత్తేపల్లి, ఆరేపల్లి , వీరరాఘవపూర్ , రేచింతల, తూంపల్లి గ్రామాలకు సాగు నీటిని విడుదల చేసేందుకు ఏర్పాటు చేశారు. తొమ్మిది గ్రామాలకు సంబంధించి 14 కిలో మీటర్ల మేర 12వేల ఎకరాలకు సాగు నీటిని అందిస్తున్నారు. రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు పండించుకుంటున్నారు. ఈ క్రమంలో కాలువకు లైనింగ్ చేసి 18 సంవత్సరాలు గడిచింది. వరద ఉధృతికి కాల్వకు రంధ్రాలు ఏర్పడి సకాలంలో నీరందక రైతులు కాలువకు అడ్డంగా రాళ్లు మట్టి వేసి సాగునీటిని మళ్లించుకుంటున్నారు. దీని కారణంగా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదని రేచింతల, కత్తేపల్లి గ్రామాల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభించడానికి మరో నాలుగు నెలల పాటు సమయం పట్టే అవకాశం ఉంది. ఆ లోపలే ప్రాజెక్టు అధికారులు స్పందించి మరమ్మతులు చేపడితే రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండించుకునే అవకాశం ఉంది. అధికారులు స్పందించి డీ6 కాలువను సందర్శించి సరైన పద్ధతిలో కాలువ తూములను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



గుంటిపల్లి గ్రామం వద్ద ప్రమాద భరితంగా మారిన డీ6 కాలువ



రంధ్రాలు ఏర్పడిన ప్రధాన ఎడమ కాల్వ

రబీ సీజన్‌లో పంటలు ఎండుతున్నాయి



డీ6 కాలువకు అనుసంధానంగా తొమ్మిది గ్రామాలు పదివేల ఎకరాలకు పైగా సాగవుతున్న కారణంగా చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదు. దీనికి తోడు కాలువ మరమ్మతులు చేపట్టి దశాబ్దాల కాలం అవుతున్న కారణంగా రంధ్రాలు ఏర్పడి మధ్యలోనే నీరు వృధా అయి చివరి ఆయకట్టు వరకు నీరందడం లేదు. ప్రాజెక్టు అధికారులు స్పందించి కాలువ మరమ్మతులు చేపడితే చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే అవకాశం ఉంది.

- ఎల్లన్న, గుంటిపల్లి గ్రామ వరి రైతు

ప్రతిపాదనలు పంపాం



తూంపల్లి, కత్తెపల్లి , రేచింతల గ్రామాల మీదుగా వెళ్లే డీ-6 కాలువకు లైనింగ్ నిమిత్తం రూ. 23 లక్షలు మంజూరు అయ్యాయి. అలాగే జూరాల గ్రామం నుండి ప్రారంభం అవుతున్న కాలువకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఇది వరకే ఇరిగేషన్ ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో డీ6 కాలువ మరమ్మతులు చేపట్టనున్నాం.

- ప్రాజెక్టు ఈఈ జగన్మోహన్

ప్లాస్టిక్‌పై అవగాహన

- ఛత్తీస్‌ఘడ్ బృందంతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం

- పురవీధుల్లో నృత్య ప్రదర్శన ద్వారా ఆకట్టుకుంటున్న బృందం



క్లాక్‌టవర్ కూడలిలో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు (ఫైల్)

మహబూబ్‌నగర్, మార్చి 29 : ప్లాస్టిక్ నిషేధంపై పురపాలిక అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. ప్లాస్టిక్ వినియోగం మాత్రం ఆగడం లేదు. దీంతో ఇప్పటికే మునిసిపాలిటీలో ప్లాస్టిక్, తడిపొడి చెత్త సేకరణపై పలు మిషనరీలు తీసుకువచ్చి మార్పుకోసం ప్రయత్నం చేస్తున్నా సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న రామ్‌కి ఫౌండేషన్ ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన కళాకారుల బృందంతో పాలమూరు పురపాలిక పరిధిలో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేయిస్తోంది. వారం రోజుల పాటు ఈ కళాకారుల బృందం పట్టణ ప్రముఖ కూడళ్లలో ఉదయం, సాయంత్రం వేళ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించేలా బద్లావ్(మార్పుకార్యక్రమం) కార్యక్రమం నిర్వహిస్తోంది. స్ట్రీట్ ప్లే, నుక్కా నాటకంతో పాటు పబ్లిక్‌తో ఇంటరాక్ట్ అవుతున్నారు. వీరి నృత్య ప్రదర్శనలు, నాటకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. ప్లాస్టిక్ వినియోగించవద్దని, జ్యూట్ బ్యాగ్‌లను వాడాలని అవగాహన కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు కూరగాయలు, మార్కెట్, పండ్ల మార్కెట్, కిరాణం దుకాణాలకు వెళ్లేటప్పుడు క్లాత్, జ్యూట్ బ్యాగులతో వెళ్లాలని, మాంసం దుకాణాలకు వెళ్లేటప్పుడు స్టీల్ బాక్స్‌లు తీసుకెళ్లాలని అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమాలు శనివారం వరకు నిర్వహించనున్నారు. కార్యక్రమాలలో మునిసిపల్ కమిషనర్, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌లు పాల్గొంటున్నారు. ప్లకార్డులు ధరించి అవగాహన కల్పిస్తున్నారు.



మెట్టుగడ్డలో నృత్యం ద్వారా ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు(ఫైల్)

సీఐఎస్‌ఎఫ్ జవాన్ అంత్యక్రియలు పూర్తి

- అధిక సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్థులు

హన్వాడ,మార్చి 29: మండలంలోని వేపూర్ గ్రామానికి చెందిన సీఐ ఎస్ఎఫ్ జవాన్ విష్ణు (26) అంత్యక్రియలు శుక్రవారం రాత్రి ముగిశాయి. పోస్టుమార్టం నివేదిక వచ్చిక పూర్తి వివరాలు తెలిస్తాయని సంబంధిత అధికారులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. ఆత్మహత్యనా, మరో కోణం ఉందా? అనేవిధంగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కలకత్తా నుంచి శుక్రవారం రాత్రి మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి అరుణ, బంధుమిత్రులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుడికి వివాహం కాలేదు. తమ్ముడు, తల్లి ఉన్నారు. గతంలోనే తండ్రి మృతిచెందాడు.



జవాన్ అంత్యక్రియల్లో పాల్గొన్న గ్రామస్థులు

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

వంగూరు, మార్చి 29: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి పల్లీమిల్లు సమీపంలోని మూలమలుపు వద్ద శుక్రవారం బైక్ అదుపు తప్పి ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. అచ్చంపేట పట్టణ సమీపంలో శంకరయ్య గుట్ట తండాకు చెందిన పర్వతాలు శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి బైక్‌పై వస్తుండగా కొండారెడ్డిపల్లి సమీపంలో అదుపు తప్పి కడిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పర్వతాలు కుడి కాలుకు బలమైన గాయం తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్‌కి ఫోన్ చేయడంతో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

బెల్లం పానకం స్వాధీనం

కోడేరు, మార్చి 29 : ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి బెల్లం పానకం స్వాధీనం చేసుకుని పలువురిపై కేసు నమో దు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని సింగా యిపల్లి తండాలో దాడులు చేయగా 400లీటర్ల బెల్లం పాన కం గుర్తించి నేలపాలు చేశామన్నారు. పలువురిపై కేసు నమోదు చేశామన్నారు. సారా తయారు చేసినా, విక్రయిస్తు న్నా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చ రించారు. దాడుల్లో కొల్లాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ హనుమంతు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

దామరగిద్ద, మార్చి29: మండల పరిధిలోని సజనాపూర్ గ్రామంలో ఒక ఇంట్లో పేకాట ఆడుతుండగా పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 5,820 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని దామరగిద్ద పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వసంత మాట్లాడుతూ పేకాట ఆడుతున్న వ్యక్తులపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం -కేసు నమోదు

అమ్రాబాద్, మార్చి 29: పదర మండల కేంద్రానికి చెం దిన బోయిన ఎల్లయ్య అనే వ్యక్తి అదృశ్యం అయ్యాడు. బాధితకుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పదర పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు గౌడ్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ సమస్యల కారణంగా భార్యాభర్తల మధ్య వాగ్వివాదం జరిగింది. మనస్తాపానికి గురైన ఎల్లయ్య గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ఆందోళనకు గురై ఎల్లయ్య కూతురు అనిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

భూత్పూర్ మండలంలో..

భూత్పూర్: పుస్తకాలు తీసుకొస్తానని ఇంటి నుంచి బయటి వెళ్లిన ఓ విద్యార్థిని అదృశ్యం అయ్యింది. ఈ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన (19) ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని ఈ నెల 28న పుస్తకాలు తీసుకొస్తానని చెప్పి ఇంటి నుంచి మార్కెట్‌కు వెళ్లింది. అయితే సాయంత్రం అయిన యువతి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన బంధువుల ఇళ్లల్లో వెతికారు. అయినా ఆచూకి దొరక లేదు. దానితో శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో యువతి తాత ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

అచ్చంపేట రూరల్, మార్చి 29 : కుటుంబ కలహాలతో విసుగు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బుడ్డతండాలో చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి శుక్రవారం సిద్దాపూర్ ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరా ల ప్రకారం.. తండాకు చెందిన కేతావత్ కవిత, జవహర్ (33) భార్యాభర్తలు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది న జవహర్ గురువారం ఉదయం 11గంటలకు తన వ్యవసాయ పొలంలో కరెంటు స్తంభానికి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని ఆత్మహత్యకు దారి తీసిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడు జవహర్‌కు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

వేర్వేరు చోట్ల పట్టుబడిన నగదు, మద్యం

మరికల్/నారాయణపేటరూరల్/అడ్డాకుల/హన్వాడ/గోపాల్‌పేట/దామరగిద్ద/గద్వాలక్రైం/వడ్డేపల్లి/ఉండవల్లి/ మద్దూరు/అమరచింత, మార్చి29: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో శుక్రవారం నగదు , మద్యం పట్టుబడింది. నారాయణపేట జిల్లా మరికల్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని లాల్‌కోట చెక్ పోస్ట్‌లో సీఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా దేవరకొండ మండలం గూరకొండ గ్రామానికి చెందిన కింగురి బీరప్ప అనే వ్యక్తి నుంచి రూ. 8,40,000 నగదు పట్టుకొని సీజ్ చేశారు. అతను ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో డబ్బును గ్రీవెన్స్‌సెల్‌కు అప్ప గించినట్లు సీఐ తెలిపారు.

● నారాయణపేట పేట మండలం ఎక్లాస్‌పూర్, దామరగిద్ద మండలం కాన్‌కుర్తి చెక్‌పోస్టుల దగ్గర శుక్రవారం రూ.3.65 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన నగదును గ్రీవెన్స్‌సెల్‌కు పంపినట్లు ఎస్పీ యోగేశ్ గౌతం తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున రూ.50వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లరాదని ఒక వేళ తీసుకెళ్తే వాటికి సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలన్నారు.

● అడ్డాకుల మండల పరిధిలోని శాఖాపూర్ టోల్‌గేట్ దగ్గర రూ.1.16 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రంలోని హోస్పేటకు చెందిన ఆదిల్ నవాజ్ కారులో హైదరాబాద్ వెళ్తుండగా టోల్‌గేట్ దగ్గర పోలీసులు తనిఖీల్లో పట్టుబడిందన్నారు. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

● హన్వాడ మండలంలోని నాయినోనిపల్లి గ్రామ సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. నారాయణపేట జిల్లా గుండుమల్ మండలం బోగారం గ్రామానికి చెందిన అంజిలయ్య అనే వ్యక్తి దగ్గర రూ. 95 వేలు నగదును గుర్తించినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. డబ్బుకు సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు చెప్పారు.

● గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గ్రామ పరిధిలో శ్రీ గండి ఆంజనేయ స్వామి దగ్గర ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు దగ్గర రూ.1.90లక్షల నగదు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హరి ప్రసాద్ తెలిపారు. బిజినపల్లి మండలం లింగసాయపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ తన కారులో నగదును తీసుకెళ్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

● అమరచింత మండల పరిధిలోని నాగల్‌కడుమూర్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రూ.80వేలు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. నర్వ మండల కేంద్రం నుంచి గద్వాల వైపు వాహనంలో వెళ్తున్న కురువ వెంకటేష్ అనే వ్యక్తిని తనిఖీ చేయగా నిబంధనలకు విరుద్ధంగా రూ.80వేలు పెట్టుకోవడం, ఆ డబ్బుకు సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. ఎన్నికల నియమావళిని ప్రజలు అతిక్రమించరాదని ఎస్ఐ పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ పేర్కొన్నారు.



మరికల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాల్‌కోట చెక్‌పోస్ట్‌లో పట్టుబడిన నగదును చూపుతున్న సీఐ

● దామరగిద్ద మండల పరిధిలోని మొగల్ మడ్కా గ్రామానికి చెందిన కావాలి పోషప్ప బైక్‌పై మద్యం తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసుల పట్టుకున్నారు. దాని విలువ రూ. 23,430గా గుర్తించారు. అలాగే ఇట్లాపూర్ గ్రామానికి చెందిన బీమయ్య మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ వసంత తెలిపారు. దాని విలువ రూ. 10300గా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

● గద్వాల క్రైం : మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని ఓ వైన్స్ షాపులో గురువారం రాత్రి నాలుగు కాటన్ల బీర్లను కొనుగోలు చేసి చెనుగోని పల్లికి తరలిస్తుండగా మార్గ మధ్యలో పట్టుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారించగా బెల్ట్‌దుకాణంలో విక్రయించేందుకు తరలిస్తునట్లు భరత్ అనే వ్యక్తి ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● వడ్డేపల్లి: గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల గ్రామంలో శుక్రవారం బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి ఎనిమిది లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

● ఉండవల్లి: ఉండవల్లి మండల కేంద్రంలోని వెంకటరమణకాలనీలోని బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్ట్‌షాపు యజమాని శంకరమ్మ తన ఇంటి వెనుక మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి 21.700 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.12,212 ఉంటుందన్నారు. శంకరమ్మపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

● మద్దూర్ మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి శివారులో రూ.24వేల విలువ గల మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నట్లు ఎస్ఐ రాంలాల్ తెలిపారు. సంబంధిత వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



అడ్డాకుల టోల్‌గేట్ దగ్గర పట్టుబడిన నగదును చూపుతున్న పోలీసులు

ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం



టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కందనూలు, మార్చి 29 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం తెలుగు దేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి ఇంటి ఆవరణలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు చిత్ర పటానికి పూల మాలలు వేసి కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి కొప్పుల రమేష్ మాట్లాడుతూ టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతీ పేదవాడికి కూడు, గూడు, గుడ్డను అందించి ప్రతీ పేదవాడి గుండెలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు నందమూరి తారక రామారావు అన్నారు. నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ తెలుగు రాష్ట్రాల్లో జెండా ఎగరేసి అధికారం చేపడుతామని ధీమా వ్యక్తం చేశారు. పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ, మండల అధ్యక్షుడు రాము, ఉపాధ్యక్షుడు శ్రీరామ, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ అభివృద్ధికి సహకరించండి



ఆస్తిపన్ను స్వీకరిస్తున్న మునిసిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

కల్వకుర్తి, మార్చి 29 : ఆస్తి పన్ను చెల్లించి కల్వకుర్తి మునిసిపల్ అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ కోరారు. కల్వకుర్తి పట్టణంలోని పలువురు ఆస్తి పన్నును శుక్రవారం కమిషనర్‌కు చెల్లించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్, కల్వ రమేష్ కమర్షియల్ భవనానికి, హైదరాబాద్ రోడ్డులో గల హిందూస్థాన్ పెట్రోలియం పెట్రోల్ పంపు యజమానులు అసెస్మెంట్ చేయించుకుని ఆస్తి పన్ను చెల్లించడం జరిగిందని తెలిపారు. పట్టణంలో భవనాలను నిర్మాణం చేసుకుని అసెస్మెంట్ చేయించుకోకుండా ఆస్తి పన్ను చెల్లించకుండా ఉన్న కమర్షియల్ భవనాల యజమానులు వెంటనే కార్యాలయానికి వచ్చి అసెస్మెంట్ చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆస్తి పన్ను పెనాల్టీపై 90శాతం రాయితీ ఈ నెల 31వరకు ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. మేనేజర్ రాజకుమారి, ఆర్‌ఐ చంద్రయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ఇంటింటికి తీసుకువెళతాం

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి

ఊర్కొండ, మార్చి 29: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాల నుంచి కేంద్ర ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నదని అన్నారు. ఆ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించి ఓట్లు అడుగుదామని, కార్యకర్తలు సైనికులుగా పనిచేసి ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీని ప్రధాని చేద్దామని పిలుపునిచ్చారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్, నాయకులు వెంకట్ నర్స్, ఆనంద్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, పూర్ణచందర్ రెడ్డి, రాఘవేందర్, తిరుపతి రెడ్డి, మహేందర్, అరవింద్ గౌడ్, సురేందర్, వెంకట్ గౌడ్, రాజు అఖిల్ గౌడ్, లవకుశ, బాలస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గేమ్యానాయక్ తండాను గ్రామ పంచాయతీగా గుర్తించాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివవర్మ డిమాండ్

కొల్లాపూర్, మార్చి 29 : కొల్లాపూర్ మండల పరిధిలోని గేమ్యానాయక్‌తండాను గ్రామపంచాయతీగా గుర్తించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివవర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాత్రి గేమ్యానాయక్‌తండాలో డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శివవర్మ మాట్లాడుతూ కొల్లాపూర్ మండలానికి ఆమడదూరంలో ఉన్న గేమ్యానాయక్‌తండాను గ్రామపంచాయతీగా గుర్తించాలన్నారు. అభివృద్ధికి దూరంగా ఉందని, ఎన్నికలు వచ్చినప్పుడే ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు, నాయకులకు తండా గుర్తుకు వస్తుందని విమర్శించారు. ఎన్నికల తర్వాత తండాల్లో నివసిస్తున్న గిరిజనులను పట్టించుకోవడం లేదని రాజకీయ కక్షలతోనే గేమ్యానాయక్‌తండాను గ్రామపంచాయతీగా గుర్తించడం లేదని, ప్రభుత్వం స్పందించి వెంటనే తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి తండాను గ్రామపంచాయతీగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్, డీవైఎఫ్ఐ నాయకులు సాయిప్రసాద్, గోపినాయక్, బాలు, సాయి, కృష్ణ, సంతోష్, శంకర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

'బూటకపు హామీలను నమ్మకండి'

కొల్లాపూర్, మార్చి 29 : కాంగ్రెస్ బూటకపు హామీలను నమ్మకుండా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు కారంగి బ్రహ్మయ్య, మండల అధ్యక్షుడు రాంచందర్‌యాదవ్‌లు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను, ఆరు గ్యారెంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేయలేకపోయిందని, కేసీఆర్ ఇచ్చిన రైతు బీమా, రైతుబంధు పథకాలను నీరుగార్చేలా ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వారు పేర్కొన్నారు.కాంగ్రెస్ బూటకపు హామీలను నమ్మకుండా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని ఆదరించి గెలిపించాలని వారు కోరారు. నాయకులు నరసింహ, పరిమ శశ్రప్రకాశ్, పెద్దమాడు మధు, విష్ణువర్ధన్, రవి, శివకుమార్, తొండరాజు, కలికటి మధు, ఓరే మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'మహిళల హక్కుల కోసం ఐక్య పోరాటాలు నిర్వహిద్దాం'

పెంట్లవెల్లి, మార్చి 29 : మహిళల హక్కుల కోసం ఐక్య పోరాటాలు నిర్వహిద్దామని ఐద్వా మహిళా సంఘం మండల కార్యదర్శి ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఐద్వా మహిళా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని ఆమె అన్నారు. ఆకలితో చావడం కన్నా పోరాడి చావడం మేలన్న నినాదాన్ని మహిళలు స్ఫూర్తి తీసుకోవాలని ఆమె అన్నారు. ఐద్వా మహిళా సంఘం మండల కమిటీ గుండమ్మ, లావణ్య, ఆదిలక్ష్మి, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మల్లెపల్లి జగన్‌ను సన్మానించిన మాజీ సర్పంచ్

కల్వకుర్తి, మార్చి 29 : ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెపల్లి జగన్ ఎన్నికయ్యారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో ఆయనను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్ పూల మాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. సన్మానించిన వారిలో మాజీ సర్పంచ్ పసుల సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు షానవాజ్‌ఖాన్, మిరియాల శ్రీనివాస్ రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, శ్రీను, శివ, లక్ష్మారెడ్డి, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

అమ్రాబాద్ మార్చి 29: అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌ను అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం సాయంత్రం తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా ఆయన ఈ స్టేషన్‌కు వచ్చారు. వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతతో విని వారికి సరైన న్యాయం అందించి పోలీసులు చేరువ కావాలని సిబ్బందికి ఆయన సూచించారు. నమోదైన కేసుల వివరాలపై సిబ్బందితో చర్చించారు. అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తయ్యేనా?

- అర్ధాంతరంగా నిలిచిపోయిన మహిళా సమాఖ్య భవనం
- పిల్లర్లతోనే ఆగిపోయిన బీసీ బాలుర వసతి గృహం
- అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- వేలల్లో ప్రభుత్వ ఆదాయం ఖర్చు
- ఇరుకు గదుల్లో కార్యకలాపాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు

కోడేరు, మార్చి 29 : ప్రభుత్వ కార్యాలయాల కోసం పక్కా భవనాలు నిర్మించాలనుద్దేశంతో లక్షల రూపాయలు మంజూరు చేశారు. పక్కా భవనాలకు భూమి పూజ చేసి శిలాఫలకాలు వేసి నిర్మాణాలు ప్రారంభించినా అధికారుల తప్పిదం వల్ల స్థలాలు వివాదంలో చిక్కి అర్ధాంతరంగా మధ్యలో ఆగిపోయాయి. మండల మహిళా సమాఖ్య భవనం పిల్లర్లు వేసి స్లాబ్ వేసి వదిలేశారు. బీసీ బాలుర వసతి గృహం నిర్మాణం కోసం సర్వే నెంబరు 274, 275లలో రెండెకరాల భూమిని బీసీ కార్పొరేషన్‌కు రిజిస్ట్రేషన్ చేయగా వేరే సర్వే నెంబర్‌లో నిర్మాణం చేపట్టి పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారు. దాదాపు 14, 15 సంవత్సరాలైనా నేటికీ బాలుర వసతి గృహం పూర్తి కాలేదు. పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలకు నెలనెలా వేలల్లో అద్దె చెల్లిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతున్నారు. అద్దె భవనాల్లో గదుల కొరత వల్ల ఇరుకు గదుల్లో అధికారులు, ప్రజలు, విద్యార్థులు, మహిళా స్వయం సంఘాల సభ్యులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. అంగట్లో అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించి నిధులు మంజూరు చేసినా అధికారుల నిర్లక్ష్యం, తప్పిదం వల్ల పక్కా భవనాలు ఆగిపోయాయి.

ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి జరిగిన తప్పిదాలను సరి చేసి పక్కా భవనాల నిర్మాణాలు పూర్తి చేసి విద్యార్థుల, మండల ప్రజల ఇబ్బందులు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఆగిపోయిన మండల మహిళా సమాఖ్య భవనం

● అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు

మండల తహసీల్దార్ కార్యాలయం, బీసీ బాలుర వసతి గృహం, మండల మహిళా సమాఖ్య కార్యాలయాలకు నిధులు మంజూరయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పక్కా భవనాల నిర్మాణాలు పూర్తి చేసి మండల ప్రజలు సమస్యలు తీర్చాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పక్కా భవనాలు పూర్తి చేయండి

ప్రభుత్వ కార్యాలయాల కోసం స్థల సేకరణ, నిధుల మంజూరు చేసినా మధ్యలో ఆగిపోయిన భవన నిర్మాణాలు పూర్తి చేయాలి. అధికారుల నిర్లక్ష్యం, తప్పిదం వల్ల భవనాల నిర్మాణాలు ఆగిపో వడంతో అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు నష్టంతో పాటు కష్టం కూడా అవుతుంది.

బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు ఒకే గదిలో చదువుకోవడం, నిద్రించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కా భవనాల స్థల సేకరణలో జరిగిన పొరపాటు వల్ల కా ర్యాలయాల నిర్మాణాలు ఆగిపోయాయి. అధి కారులు, ప్రజాప్రతినిధులు వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్మాణాలు పూర్తి చేయాలి.



- నరసింహ బావాయిపల్లి గ్రామం, కోడేరు మండలం

బీజేపీతోనే దేశాభివృద్ధి

- ఎంపీ పోతుగంటి రాములు



బీజేపీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పోతుగంటి రాములు, చిత్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్, మార్చి 29 : భారతదేశ మూడవసారి ప్రధానిగా నరేంద్రమోదీ కావడం తథ్యమని ఆయన సారథ్యంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు పేర్కొన్నారు. శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ బీజేపీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ఎంపీతో పాటు నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి ఎంపీ రాములు మాట్లాడుతూ 167కే జాతీయ రహదారి గురించి పలుమార్లు పార్లమెంట్‌లో తాను మాట్లాడి మంజూరు చేయించానని, ఈ విషయంలో ఎల్లేని సుధాకర్‌రావు, తల్లోజు ఆచారిలు తనకెంతో సహకరించారన్నారు. శ్రీశైలం హైవే నుంచి కల్వకుర్తి మీదుగా లింగాల, కొల్లాపూర్ వరకు జాతీయ రహదారి కావాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరారని వినతి పత్రం కూడా అందజేశారని పేర్కొన్నారు. మామిడికాయలకు పుట్టినిల్లుగా ప్రసిద్ధిగాంచిన కొల్లాపూర్ ప్రాంతంలో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి తాను ప్రతిపాదించడం జరిగిందన్నారు. మూడవసారి దేశప్రధానిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా గెలవబోతున్న భరత్‌ప్రసాద్ ఇవన్నీ మంజూరు చేయించి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారని ఎంపీ తెలిపారు. ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రధాని నరేంద్ర మోదీ మన దేశాన్ని కాపాడి ప్రపంచానికే మార్గదర్శిగా నిలిచారని ఆయన అన్నారు. ప్రధాని దేశవ్యాప్తంగా అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతీ గ్రామంలో ప్రజలకు వివరించి ఓటు కోరుతానని, తనను ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని భరత్‌ప్రసాద్ బీజేపీ నాయకులను, కార్యకర్తలను, కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలను కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు మాట్లాడుతూ మూడవసారి ప్రధాని కాబోతున్న నరేంద్రమోదీకి నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపించి బహుమతిగా ఇవ్వాలని సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. జాతీయ మాజీ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత రైతులకు సాగునీరు, విద్యుత్ సరఫరా నిలిచిపోయాయని, 2లక్షల రుణమాఫీ అమలు చేయలేదని, ప్రతీ గ్రామంలో మోదీ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించి బీజేపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ గెలుపు కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు తమటం శేఖర్‌గౌడ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మేకల శ్రీనివాస్‌యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు సందు రమేష్, కొల్లాపూర్ బీజేపీ మండల అధ్యక్షుడు తమటం సాయికృష్ణగౌడ్, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షుడు పదిర భీమేష్, పాన్‌గల్ బీజేపీ మండల అధ్యక్షుడు అన్వేష్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 29: జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చిలో శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి చైర్మన్ కె.ఎస్.జోసెఫ్ మాట్లాడుతూ లోకంలోని ప్రతి ఒక్కరి పరిహార నిమిత్తం ప్రభువైన యేసుక్రీస్తు శిలువపై రక్తము కార్చి మృతి చెందిన దినంగా గుడ్ ఫ్రైడే జరుపుకుంటారని పేర్కొన్నారు. లేఖనాల్లో రాసి ఉన్న దాని ప్రకారంగా ప్రభువైన ఏసుక్రీస్తు సిలువపై మృతి చెందిన మూడు రోజులకు తిరిగి మృత్యుంజయుడుగా లేచాడన్నారు. అనంతరం ఏసుక్రీస్తు శిలువ వేయబడు సమీపంలో మాట్లాడిన ఏడు మాటలను గురించి సంఘ పెద్దలు క్రైస్తవులందరికీ విపులీకరించి చెప్పారు. సంఘ పెద్దలు ఏలియా, నథనీల్, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లోని ఎంబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జిల్లా నాయకులు



రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తిని కలిసిన మండల వీహెచ్‌పీ నాయకులు

తెలకపల్లి, మార్చి 29: విశ్వహిందూ పరిషత్ నాగర్‌కర్నూల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి శుక్రవారం విచ్చేసిన రాష్ట్ర విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు భోజనపల్లి నరసింహమూర్తిని తెలకపల్లి మండల, జిల్లా ప్రఖండ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలకపల్లి మండల వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి వారితో మాట్లాడుతూ హిందువులతో ఐక్యతాభావం, సంఘటిత శక్తి పెంపొందించేలా వీహెచ్‌పీ చేపడుతున్న అన్ని కార్యక్రమాలు గ్రామగ్రామాన వ్యాప్తి చేయాలని కోరారు. వీహెచ్‌పీ జిల్లా సహాయ కార్యదర్శి మారోజు ఉమాపతి ఆచార్యులు, మండల అధ్యక్షుడు కిశోర్, కార్యదర్శి శివ, కృష్ణ, సభ్యులు చెన్నబాబు, శివకేశవులు పాల్గొన్నారు.

నేటి సన్నాహక సమావేశానికి తరలి రావాలి

తిమ్మాజిపేట, మార్చి 29 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని వెలమ ఫంక్షన్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే బూత్ లెవల్ ఏజెంట్ల సన్నాహక సమావేశానికి తరలి రావాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, మాధవులు కోరారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో వారు శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిల ఆదేశానుసారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు విధిగా 30మంది బూత్ లెవల్ ఏజెంట్లను తరలించి విజయవంతమయ్యేలా చూడాలన్నారు. జరగనున్న ఎంపీ ఎన్నికలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సన్నాహక సమావేశం సాయంత్రం 4గంటలకు ఉంటుందన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని కార్మికుల నిరసన

లింగాల, మార్చి 29: మండల కేంద్రంలోని కమ్యూనిటి ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న కార్మికులకు గత 6నెలల నుంచి వేతనాలు చెల్లించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని కాంట్రాక్ట్ ఉద్యోగులు శుక్రవారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఆరు నెలలుగా తమకు జీతాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబం పస్తులుండాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఏజెన్సీ కాంట్రాక్టర్ స్పందించకపోతే ఏప్రిల్ ఒకటి నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు వారు హెచ్చరించారు. కాంట్రాక్టు ఉద్యోగులు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఘనంగా వ్యాస రాయుల ఆరాధన ఉత్సవాలు

నారాయణపేట, మార్చి 29 : నారాయణపేట రాఘవేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం వ్యాసరాయుల ఆరాధన ఉత్సవాలు విద్వాన్ ప్రహ్లాద దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, భజన, పల్లకీ సేవ, సర్వసేవ కార్యక్రమాలను నిర్వహించారు. విద్వాన్ అనిల్ దేశాయి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తూ వ్యాసరాయుల మహిమలను కొనియాడారు. ప్రతీ ఒక్కరిలో దైవభక్తి కల్గి సన్మార్గంలో నడవాలని అన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర సేవ సమితి సభ్యులు నర్సింహాచారి, ప్రహ్లాద, మంజునాథ్, భీంసేన్‌రావు, అనంతరావు, ధీరజ్, అనిరూధ, ప్రభంజన్‌రావు పాల్గొన్నారు.



రాఘవేంద్ర ఆలయంలో అలంకరణ

తాండ్రలో మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందు



మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఇస్తున్న కాయితీ ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తి, మార్చి 29 : మైనార్టీల సంక్షేమానికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కాయితీ ఆశాదీప్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి మండలం తాండ్ర, జూపల్లి గ్రామాల మైనార్టీ సోదరులకు కాయితీ ఆశాదీప్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. అంతకు ముందు ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్‌మాసం ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. ముస్లింలకు తాను ఎప్పుడు అండగా ఉంటానని కాయితీ ఆశాదీప్‌రెడ్డి పేర్కొన్నారు.

తీసుకున్న రుణాలు తిరిగి చెల్లిస్తేనే బ్యాంకుల మనుగడ

వంగూరు, మార్చి 29: బ్యాంకుల నుంచి తీసుకొన్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తేనే బ్యాంకులు మనుగడ సాధిస్తాయని ఏపీజీవీబీ బ్యాంకు ఆర్ఎం ఆశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామాన్ని ఏపీజీవీబీ బ్యాంకు సిబ్బంది జూపల్లి వారితో కలిసి సందర్శించారు. బకాయిలు ఉన్న రాజీవ్ మహిళా సంఘం వారి నుంచి రూ. 1,80,000 చెక్కులను కలెక్టు చేసుకొన్నారు. వంగూరు మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరం మహిళా స్వయం సహాయ సంఘాల లక్ష్యం బ్యాంకు లోన్లు రూ. 21,02,65000 గాను వంద శాతం వసులు చేశామని ఏపీఎం చంద్రయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు శివప్రసాద్, బ్యాంకు సిబ్బంది ఖాదర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

తెలకపల్లి, మార్చి 29 : క్రీడలతోనే మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం, ఐకమత్యం సాధ్యమని స్థానిక ఎస్ఐ బి.నరేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తెలకపల్లి క్రికెట్ ప్రీమియం లీగ్-2 క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు క్రీడలను ప్రోత్సహించాలని క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని తద్వారా దేశభక్తి పెరుగుతుందని అన్నారు. క్రికెట్ ప్రీమియం నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు బి.లక్ష్మణ్, ఎండి.హర్షద్, రాజు, ఏడు క్రికెట్ టీమ్‌ల క్రీడాకారులు పాల్గొన్నారు.

కోడేరు మండలంలో ముమ్మర తనిఖీలు

కోడేరు, మార్చి 29 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం మండల పరిధిలోని నర్సాయిపల్లి చౌరస్తాలో స్థానిక ఎస్ఐ కురుమూర్తి, పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎవరైనా 50వేల రూపాయల కన్న ఎక్కువగా నగదును తీసుకెళ్లరాదని ఏదైనా అవసరం ఉంటే అందుకు సంబంధించిన పూర్తి వివరాలు చూయించి తీసుకెళ్లాలని అన్నారు. ఈ విషయం ప్రతి ఒక్కరు పాటించాలని ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

నేడు ఉమామహేశ్వరంలో అన్నదానం బంద్

అచ్చంపేట, మార్చి 29: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం రోజు శుభకార్యాలు అధికంగా ఉండడం వల్ల భక్తులు రాకకూడా తక్కువగా ఉంటుందని, దీనికి తోడు ఉమామహేశ్వరంలో పనిచేస్తున్న సిబ్బంది కూడా వివిధ శుభకార్యాలకు హాజరు కానున్న నేపథ్యంలో ఈ నెల 30న ఉమామహేశ్వర క్షేత్రంలో అన్నదానం నిలిపి వేస్తున్నట్లు ఆలయ కమిటీ ఈవో శ్రీనివాస రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి మరసటి రోజు నుంచి యాధావిధిగా అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

అచ్చంపేట, మార్చి 29: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వడ్డెర రాష్ట్ర నాయకుడు శ్రీశైలం అన్నారు. ఆయన శుక్రవారం విలేక రులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇప్పటికే చాలా వరకు కార్పొరేషన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి వడ్డెర అభ్యున్నతికి పాటుపడా ల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడ్డెరులు సరైన పనులు లేక వలసలు వెళుతూ దుర్భర జీవితాలను గడుపుతున్నారని ప్రభుత్వం ఆదుకొని వడ్డెర కుటుంబాలలో వెలుగులు నింపాలన్నారు. ముఖ్యమంత్రిపై పూర్తి విశ్వాసం మాకు ఉందని త్వరలో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తారని ఆశిస్తున్నామన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని సన్మానించిన ఎమ్మెల్యే



బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని సన్మానించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, మార్చి 29: ఉద్యమ నాయకుడు తెలంగాణ సాధనలో అలుపెరుగని పోరాటం చేసిన యువ నాయకుడు రాజేందర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. జడ్పీటీసీ సభ్యులు ప్రతాప్ రెడ్డి, నాయకులు నర్సింహ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కోడేరు, మార్చి 29 : మండల కేంద్రానికి చెందిన యువకుడు అకస్మాత్తుగా మరణించడంతో అతని కుటుంబానికి శుక్రవారం స్థానికులు ఆర్థిక సహాయం చేశారు. మండల కేంద్రానికి చెందిన శివ(32) గురువారం రాత్రి చనిపోగా అతని భార్య గతంలోనే చనిపోయిందని వారికి ఒక పాప, ఒక బాబు ఉన్నారు. తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథలుగా మారిన పిల్లలకు కాంగ్రెస్ నాయకులు దూరెడ్డి బ్రదర్స్, గ్రామస్థులు 25వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలను మనస్సున్న మహానుభావులు ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● తిమ్మాజిపేట: నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బాధిత కుటుంబానికి శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని బుద్ధ సముద్రం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు పార్వతమ్మ గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. నిరుపేద కుటుంబమని మగ దిక్కులేరని ఈ విషయాన్ని పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి సమాచారమివ్వడంతో స్పందించిన ఆయన కార్యకర్తల ద్వారా పదివేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు 6116 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు బాలయ్య, మాజీ సర్పంచ్ రాణెమ్మ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శేఖర్‌రావు, ఈశ్వరయ్య, బాలరాజు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని నారాయణపల్లి గ్రామ కాంగ్రెస్ కార్యకర్త నల్లవాల బాలచంద్రయ్య గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ దండు నరసింహ మృతుని కుమారులు పెద్దకాశీం, చిన్నకాశీంలకు 5వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పరుశరాములు, మురళి, మోహన్, బాలపీరు, బాలు, రామచందర్, స్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగుల గొంతుక వంశీచంద్ రెడ్డి'

ఊర్కొండ, మార్చి 29: నిరుద్యోగుల గొంతుక కాంగ్రెస్ పార్టీ మహ బూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి వంశీ చందర్ రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కో ఆర్డినేటర్ షై బాజోద్దీన్ అన్నారు. మండలంలోని ఊర్కొండ పేటలోని ఆయన స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినే టర్లు యూత్ కాంగ్రెస్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చల్లా వంశీ చందర్ రెడ్డి నిరుద్యోగుల కోసం అసెంబ్లీలో తన గళం వినిపించాడో, అదేవిధంగా ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే మన పాలమూరు అభివృద్ధి కోసం తన గళం వినిపిస్తాడని తెలిపారు. ప్రతీ ఒక్కరు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించే విధంగా కృషి చేద్దామని అన్నారు. ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు కైసర్ నాయకులు మల్లేష్, మాసుం తదితరులు ఉన్నారు.

'పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలను గుర్తించాలి'

కల్వకుర్తి, మార్చి 29 : కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పది సంవత్సరాలు పని చేసిన కార్యకర్తలను గుర్తించాలని బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడు పరుశపాకుల శేఖర్ ఒక ప్రకటనలో కోరారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారితోపాటు పాత వారికి సైతం ప్రాధాన్యతనివ్వాలని ఆయన కోరారు.